ప్రైవేట్ ఉపాధ్యాయులను ప్రభుత్వమే ఆదుకోవాలి



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో అజయ్ కార్తీక్ తదితరులు

చంపాపేట: అరకొర వేతనాలతో అలమటిస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయులను ప్రభుత్వమే ఆదుకునేలా అసెంబ్లీలో వాణిని వినిపించాలని టీపీయూఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ కార్తీక్ ఆధ్వర్యంలో ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కర్మన్‌ఘాట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అజయ్‌కార్తీక్ మాట్లాడుతూ... ఉన్నత విద్యార్హతలతో ప్రైవేట్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు పనికి తగ్గ వేతనం అందడం లేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అర్హులైన ప్రైవేట్ ఉపాధ్యాయులకు కూడా అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు జగన్‌బాబు, రాంచందర్, కొండల్, భీమ్లా తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ డీసీపీకి శుభాకాంక్షలు



చంపాపేట: ఎల్‌బీనగర్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్‌ను ఆదివారం కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్ నల్లా రఘుమారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పాలక మండలి సభ్యులు మధుసాగర్, నాయకులు కిరణ్, గౌర శ్రీనివాస్, చిరంజీవి, సాగర్ తదితరులు డీసీపీని కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

లెనిన్‌కు ఘన నివాళి



లెనిన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

నాగోలు: వీఐ లెనిన్ శత వర్ధంతిని ఆదివారం నాగోలు డివిజన్‌లోని ప్రజా సంఘాల భవన్‌లో నిర్వహించారు. సీపీఐ మేడ్చల్ జిల్లా నాయకుడు బొడ్డుపల్లి కృష్ణ ఆధ్వర్యంలో లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి పి.రామనారాయణ మాట్లాడుతూ, కార్మికుల, శ్రామికుల ప్రజారాజ్య స్థాపన కోసం లెనిన్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు భూపతి, సురేష్, ఎండీ బషీర్, మల్లేశం, మధు, రాములు, శివ, ఆంజనేయులు పాల్గొన్నారు.

క్రికెట్ కెప్టెన్ త్రిషాపూజితకు సన్మానం



త్రిషా పూజితను సన్మానిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హుడాకాంప్లెక్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఉమెన్ అండర్–23 క్రికెట్ కెప్టెన్ త్రిషా పూజితను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తపేటకు చెందిన త్రిషా పూజిత రాష్ట్రం నుంచి డబ్ల్యూపీఎల్‌లో గుజరాత్ జెయింట్స్ టీమ్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించటం అనేది చాలా గర్వించదగిన విషయమన్నారు. జాతీయ స్థాయిలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని, ఇందుకు తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. త్రిషా పూజితకు క్రికెట్‌లో తర్ఫీదు ఇచ్చిన శ్రీనివాస్, చాముండేశ్వరీనాథ్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ క్రికెట్ కోచ్ రాజశేఖర్‌రెడ్డిలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఆర్మీ మాజీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో ఆర్మీ మాజీ ఉద్యోగులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మాజీ ఆర్మీఉద్యోగులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. గతంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి సంక్షేమ సంఘానికి స్థలం కేటాయించి భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ఈ హామీని ఎమ్మెల్యే నిలబెట్టుకోవాలని వారు కోరారు. వీటితో పాటు ఎక్స్ సీఏపీఎఫ్ వెల్ఫేర్ బోర్డు స్థాపించడానికి కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వారు పేర్కొన్నారు. దీనికోసం సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కె.శ్యామ్ సుందర్‌రెడ్డి, ముఖ్య సలహాదారుడు ఎస్ఎస్‌రెడ్డి, రాజరత్నం, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

బడంగ్‌పేట్: తెలంగాణ బి గ్రేడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ డైరీ, కేలండర్‌ను సంఘం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. తెలంగాణ లైసెన్స్ బోర్డు మెంబర్‌గా నేమాల బెనర్జీని వారు ఏర్పాటు చేసుకున్న సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఉద్యోగులు బెనర్జీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, రఘు, సయ్యద్ పాషా, మల్లేష్‌యాదవ్, ఉదయభాస్కర్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.



బెనర్జీని సన్మానిస్తున్న ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

వైభవంగా సీతారాముల కల్యాణం

సైదాబాద్: అయోధ్యలో శ్రీరామ మందిరం నిర్మించాలన్న హైందవుల శతాబ్దాల కల సాకారమవుతుండటం అందరికీ ఎంతో సంతోషదాయకమని లతామా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ మాధవీలత కొంపెల్ల అన్నారు. సోమవారం అయోధ్యలో నిర్మించిన భవ్య రామ మందిరంలో నిర్వహించే ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆదివారం సైదాబాద్ డివిజన్ ఏపీఏయూ కాలనీలోని ధర్మ నిలయంలో లతామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. ఆర్ఎస్ఎస్ నాయకులు రమేష్‌రాజు, పరమేష్, సుధాకర్, శివగౌడ్, కృష్ణ మనోహర్, భరత్ పాల్గొన్నారు.

వాడవాడలా రాములోరి శోభాయాత్ర

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలో అన్ని కాలనీలు, బస్తీల్లో శ్రీరాముల వారి శోభాయాత్రను భక్తులు వైభవంగా నిర్వహిస్తున్నారని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. విజయశ్రీ కాలనీలోని పద్మావతి వేంకటేశ్వర ఆలయం నుంచి శ్రీరాముల శోభాయాత్రను ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ, అయోధ్యలో భవ్య రామ మందిరంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన సోమవారం కనుల పండువగా జరుగుతుందని అన్నారు. హిందువులంతా చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా ఐక్యంగా ప్రతి ఇంటిపై కాషాయపు జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కాలనీవాసులు, ఆర్ఎస్ఎస్ నేతలు పాల్గొన్నారు.

జైపురి కాలనీలో పాదయాత్ర

లింగోజిగూడ: నాగోలు హనుమాన్ వ్యాయామశాల ఆధ్వర్యంలో ఆదివారం జైపురి కాలనీలోని సాయిబాబా ఆలయం నుంచి కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం వరకు రాముల వారి చిత్ర పటంతో పాదయాత్ర నిర్వహించారు. టూరిజం అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్, ఐవీఎఫ్ అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. నాయకులు లక్ష్మణ్‌గౌడ్, గిరియాదవ్, గోపి, మాధవశర్మ, భాను పాల్గొన్నారు.

వనస్థలిపురంలో..

వనస్థలిపురం: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ పుర వీధుల్లో శ్రీరాముల వారి శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్జీవోస్ కాలనీలోని ఎల్లమ్మ దేవి ఆలయ కమిటీ చైర్మన్ వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం వనస్థలిపురం ఛత్రపతి శివాజీ గ్రౌండ్స్‌లో శ్రీరామ జ్యోతి, మహిళలచే లక్ష దీపోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కాగా, శోభాయాత్రలో నాయకులు క్లెం రవీందర్‌రెడ్డి, యాదగిరిరావు, నారాయణరావు, రాంరెడ్డి, కృష్ణారెడ్డి, సురేందర్‌జీ, శ్రీలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.



వనస్థలిపురంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రతినిధులు



విజయశ్రీ కాలనీలో శోభాయాత్రను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి



ధర్మ నిలయంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



పాదయాత్ర చేస్తున్న శ్రీనివాస్‌గుప్తా తదితరులు

బాలికలను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు



చిన్నారుల తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ వినీతాదేవి

చంపాపేట: లింగ వివక్షత చూపకుండా బాలికలను వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో వెన్నుతట్టి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని బాలికల అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి వినీతాదేవి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని క్రాంతి యువజన సంఘ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బాలికల ఎదుగుదల, సంరక్షణ, హక్కులు వంటి అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆడపిల్లల పట్ల లింగ వివక్ష, ఆంక్షలను నిర్మూలించేందుకే కేంద్ర ప్రభుత్వం జాతీయ బాలికల అభివృద్ధి మిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న బాలికల రక్షణ, విద్య, అభివృద్ధి కోసం భేటీ బచావో..భేటీ పడావో నినాదంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని గుర్తు చేశారు. అనంతరం బాలికలను సంరక్షిస్తామని, ఉన్నత చదువులు చదివిస్తామని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారుల తల్లిదండ్రులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నారాయణమ్మ, సఖి విభాగాధికారి శ్రీలత, సిబ్బంది కవిత, హర్షిత అంగన్‌వాడీ ఉపాధ్యాయులు శ్రీలత, యాదమ్మ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యోగా సాధనతో మానసిక ఒత్తిళ్లు దూరం



యోగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న భిక్షమయ్య గురూజీ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: యోగా సాధనతో మానసిక ఒత్తిళ్లు దూరమవుతాయని, ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని భిక్షమయ్య గురూజీ అన్నారు. ఆదివారం ఆర్‌కేపురంలోని చిత్ర లేఅవుట్ కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత యోగా శిక్షణ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భిక్షమయ్య గురూజీ జ్యోతి ప్రజ్వలన చేసి యోగా సాధకులకు మంత్రోపదేశం చేస్తూ సమాధి స్థితిని సాధన చేయించారు. ధ్యానులకు పచ్చికూరగాయలతో చేసిన అమృత ఆహారాన్ని అందించారు. రెండు రోజుల పాటు ఈ శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 23, 24 తేదీల్లో హస్తినాపురం మేజర్ పద్మపాణి ఆచార్య కమ్యూనిటీ హాల్‌లో, 25,26 తేదీల్లో దిల్‌సుఖ్‌నగర్‌లోని లోటస్‌ల్యాప్ పబ్లిక్ స్కూల్ తదుపరి శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిత్రలేఔట్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెండ్యాల నగేష్, గౌరవ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కల్చరల్ సెక్రటరీ రామచంద్రరావు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కాచిగూడ: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. బర్కత్‌పురాలోని పార్టీ నగర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రగతిలో మహిళలు కీలక భాగస్వామిగా ఉన్నారన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, బీజేపీ మహిళా మోర్చా నేతలు శిల్పారెడ్డి, కె.గీతామూర్తి, విజయ పాల్గొన్నారు.

భవన నిర్మాణం కోసం వినతి

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్‌లో అసంపూర్తిగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీహాల్‌ని వెంటనే పూర్తి చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌కు ఆదివారం బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం, ఆరోగ్యం



ప్రారంభోత్సవానికి హాజరైన కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, క్రీడాకారులు

మలక్‌పేట: క్రీడలు మానసికోల్లాసంతో పాటు ఆరోగ్యాన్ని ఇస్తాయని మూసారం బాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 19వ, ఇన్విటేషనల్ రిపబ్లిక్ డే టోర్నమెంట్ ఆదివారం మూసారం బాగ్ ఎస్‌బీహెచ్ కాలనీ జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్స్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కార్పొరేటర్ తో పాటు అర్జున అవార్డు గ్రహీతలు చేతన్ ఆనంద్, సిక్కి రెడ్డి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ ఉపాధ్యక్షురాలు సారద గోవర్ధిని, ఒలింపిక్స్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సుమిత్‌రెడ్డి హాజరయ్యారు. యువత క్రీడలపై దృష్టి సారించాలని వారు అన్నారు. టోర్నీ నిర్వాహకులు అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, కన్వీనర్ కొరెడ్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్‌యాదవ్, ఉపాధ్యక్షులు గంగుల వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేశం, సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి స్వామిగౌడ్ పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టండి



కాలనీలోని సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

నాగోలు: కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. డివిజన్ పరిధిలోని న్యూ మారుతి నగర్‌లో ఆదివారం కార్పొరేటర్ కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. అభివృద్ధి పనులు జరిగేటప్పుడు ఇతర పైప్‌లైన్లు పగులుతున్నాయని, ర్యాంప్‌లను ఇష్టానుసారంగా తొలగిస్తున్నారని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. అధికారులతో మాట్లాడి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. అధికారులు దగ్గరుండి అభివృద్ధి పనులను చేయించాలని ఏఈ మాతృనాయక్‌ను కోరారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయండి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. మిథులానగర్‌లో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కార్పొరేషన్ భవనాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండేలా సకల సౌకర్యాలతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, కార్పొరేటర్లు అర్కల భూపాల్‌రెడ్డి, సిద్ధాల లావణ్య, బీఆర్ఎస్ మీర్‌పేట అధ్యక్షుడు అర్కల కామేశ్ రెడ్డి పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ..

జిల్లెలగూడ 16వ డివిజన్ పాష్‌కాలనీలోని ఉప్పరి సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌యాదవ్, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ డైరెక్టర్ మేకల యాదగిరి, నాయకులు చల్ల సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు

లింగోజిగూడ: అయోధ్యలో నిర్వహించే బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్– 1లోని ఆంజనేయ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పూజల్లో భాగంగా శ్రీరామ తారక మహామంత్ర యజ్ఞం, శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు అన్నప్రసాద వితరణ

చంపాపేట: డివిజన్ పరిధిలోని నిర్మలానగర్ కాలనీలోని ప్రసన్నాంజనేయ, శివ, సీతారామ చంద్రస్వామివారి ఆలయంలో సోమవారం అయోధ్యలో జరిగే బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ సన్నివేశాన్ని భక్తులకు ఎల్ఈడీ స్క్రీన్‌పై చూపిస్తామని ఆలయ నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఖాళీ స్థలాలను ఆట స్థలాలుగా అభివృద్ధి చేయాలి

సైదాబాద్: ఖాళీ స్థలాలను చిన్నారుల ఆట స్థలాలుగా అభివృద్ధి చేయాలని దళిత ఉమెన్స్ కలెక్టివ్ ప్రతినిధి సూరేపల్లి సుజాత జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. ఆదివారం ఐఎస్‌సదన్ డివిజన సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్ సమీపంలోని ఖాళీ స్థలంలో పెద్ద ఎత్తున పేరుకుపోయిన చెత్తను దళిత్ ఉమెన్స్ కలెక్టివ్, ది సేఫ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తొలగించారు. ఈ పనులను పరిశీలించిన సుజాత మాట్లాడుతూ, నిరుపయోగంగా ఉన్న స్థలాల్లో నెలకొన్న అపరిశుభ్రత కారణంగా సమీపంలోని ఇళ్ల వారు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారి ఇబ్బందులను తొలగించేందుకు తమ సంస్థల తరపున చెత్త పనులు చేపట్టామని తెలిపారు. ఈ స్థలాన్ని సింగరేణి కాలనీలోని చిన్నారులు ఆడుకునేందుకు అనువుగా తీర్చిదిద్దుతామని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి ఉత్సవాలు

లింగోజిగూడ: మహిళా అంధుల సంఘం ఆధ్వర్యంలో లింగోజిగూడ డివిజన్‌లోని ప్రభుత్వం అంధుల కళాశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంధులు పాడిన పాటలు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీవాణి, సంఘం సభ్యులు శ్రీకన్య, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మాజీ కార్పొరేటర్ రాజీనామా

కవాడిగూడ: బీఆర్ఎస్ పార్టీకి దోమలగూడ మాజీ కార్పొరేటర్ టి. రవీందర్ రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులను బీఆర్ఎస్ చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పార్టీలో నేటికీ కుటుంబ పాలనే కొనసాగుతోందని, కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యం లేదన్నారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

నల్లకుంట: అయోధ్య ఆలయ ప్రారంభం సందర్భంగా సోమవారం(నేడు) దత్తసాయి మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాలలో ఉచిత దంత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఎంఎస్ రంగారెడ్డి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ విషయం వెల్లడించారు. నల్లకుంట పీవర్ ఆస్పత్రి ఎదురుగా, అంబర్‌పేట, రామంతాపూర్, నాగోల్, చైతన్యపురిలో ఉన్న దత్తసాయి దంత వైద్యశాలల్లో ఈ శిబిరం ఉంటుందన్నారు. ఫోన్ నం. 92463 66944కు కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 17, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 50, క్యాబేజీ 19, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 23, దొండ 21–23, చిక్కుడు 23–35, గోకర 45, బీట్‌రూట్ 15, క్యాప్సికం 50, ఆలు 19–23, దోస 23, సొర 9, పొట్ల 15, ఉల్లిగడ్డ 23, చామగడ్డ 67. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.